
Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(3), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

# “పరిశోదకులకు మార్గదర్శి - ఆచార్య గంగిశెట్టిలక్ష్మీనారాయణ”

డాక్టర్.మండి అన్వర్ హుస్సేన్
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు,
ఉస్మానియా కళాశాల, కర్నూలు,
ఆంధ్రప్రదేశ్.



Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(3), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in

ఆచార్య గంగిశెట్టిలక్ష్మీనారాయణ అనంతపురం జిల్లా కదిరి పట్టణం, తనకల్లు గ్రామంలో 1947వ సంవత్సరంలో శ్రీమతి జింకా రుక్మిణమ్మ, జింకా గంగిశెట్టిలకు జన్మించారు. నేలనపడ్డ 10నెలలకే కన్నతండ్రి గతిస్తే అంతా తానై కాపాడినవారు పితామహులు జింకా చెన్నరాయప్ప.

1965లో తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర విద్యాలయంలో స్పెషల్ ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ అంశాలతో బి.ఏ.,లో చేరి పట్టభద్రులయ్యారు. విద్యార్థి దశలోనే కళాశాల మ్యాగజైన్‌లో 'మృన్మయ జీవితం' అనే కథను రాశారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ కళాశాలలో పట్టభద్రస్థాయిలో ఆంగ్ల సాహిత్యాన్ని ప్రత్యేక ఐచ్చికంగా అధ్యయనం చేసిన ఫలితంగా తెలుగులో విమర్శను శాస్త్రీయంగా రాసే అలవాటు చేసుకున్నారు. ఆంగ్లంతో పాటు తెలుగు, తమిళం, కన్నడ బాషలలో అనర్గలంగా మాట్లాడగలిగే వారు ఆచార్య గంగిశెట్టి లక్ష్మీ నారాయణగారు 'తెలుగు సంస్కృతి శాసనాల, చారిత్రక పరిణామాలు' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని ప్రచురించి పిహెచ్.డి., పట్టాను అందుకున్నారు.

వీరి ప్రసిద్ధమైన రచనలలో 'తెలుగు చరిత్ర - కొన్ని కొత్త చూపులు', 'సాహిత్య పరిశోధనా కళ ' చెప్పుకోదగినవి. అలాగే ఇందిరా గోస్వామి రచించిన "ఊనే ఖోవా హోదా " అస్సామీ నవలను "విషాద కామరూప" పేరుతో తెలుగులో అనువదించారు.

బెంగుళూరు క్రీస్తు కళాశాలలో, సెంట్ జేవియర్ కళాశాల మద్రాసులలో చేసిన ఉద్యోగ ప్రభావం వల్లనేమో నాలుగు బాషల సామాన్య సాహిత్య ధర్మాలు, సంప్రదాయాల అధ్యయనం మీద మక్కువపెంచుకొన్నారు. తెలుగు కన్నడ అనువాదాలు చేపడుతూ, తులనాత్మక సాహిత్య రంగంలో కృషిచేయసాగారు. వీరి అనువాద గ్రంథాలలో కన్నడం నుంచి 1973లో బిళిగిరి గారి 'వర్ణనాత్మక వ్యాకరణ' అనువాదం ప్రత్యేకమైనది.

ఆచార్య ఎస్.ఎల్.భైరప్ప గారి కన్నడ నవల 'పర్వ'ను తెలుగులో అనువాదంచేసి కేంద్ర సాహిత్య అకాడమీ అనువాద అవార్డును పొందారు. కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ 'కావ్యానందం' కావ్యాన్ని తెలుగునుండి కన్నడంలోనికి అనువదించారు.

తెలుగు కన్నడ సాహిత్యాలతో మొదలైన అధ్యయనం, క్రమంగా వీరిని తులనాత్మక భారతీయ సాహిత్య అధ్యయనం వైపు నడిపించింది. తులనాత్మక సాహిత్యమంటే తులనాత్మక భారతీయ సాహిత్యమేనని, భాషా సారస్వతాల సమన్వయమే దాని స్వరూపమని అందులో ఏభాషా సాహిత్యాన్ని సరిగ్గా ఆకళింపు చేసుకోవాలనుకొన్నా తులనాత్మక భారతీయ నేపథ్యం నుంచి అధ్యయనం చేసినప్పుడే సమగ్రత సిద్ధిస్తుందని, గట్టిగా విశ్వసిస్తూ, ఆ దృక్కోణం నుంచే తమ వ్యాసాలను రచించారు.

హైదరాబాదు నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం, తులనాత్మక అధ్యయన శాఖ ఆచార్యులుగా, డీన్‌గా దీర్ఘకాలం పనిచేశారు. తరగతి గదిలో వీరి బోధన చాలా ప్రత్యేకంగా ఉండేది, వీరు గొప్ప మేధావి. భారతదేశ చరిత్ర, సంస్కృతి, మావన జీవపరిణామ క్రమం, ప్రాచీన భారత జీవన విధానం, సాంస్కృతిక పునరుజ్జీవనం, భారతీయ ఆహారపు అలవాట్లు, భౌగోళిక సహజ వనరులు, భిన్న జీవన విధానాలు వాటి క్రమం, వివిద భాషలలో బిన్న సాహత్యి ప్రక్రియల ఆవిర్భావం వికాసాలు వాటి కారణాలు, కుటుంబ వ్యవస్థ, లింగ వివక్ష వంటి అంశాలపై సంపూర్ణమైన అవగాహనతో విద్యార్థులకు


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881(Print); IMPACT FACTOR :9.014(2025); IC VALUE:5.16; ISI VALUE:2.286
PEER REVIEWED AND REFEREED INTERNATIONAL JOURNAL
( Fulfilled Suggests Parametres of UGC by IJMER)
Volume:14, Issue:8(3), August, 2025
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: Reviewed : Accepted
Publisher: Sucharitha Publication, India
Online Copy of Article Publication Available : www.ijmer.in


వారు బోధించే తీరు ప్రత్యేకంగా ఉండేది. కొన్ని సందర్భాలలో పాఠ్యాంశంతో ప్రారంభమై వివిధ అంశాలలో చర్చ జరిగేది. "ఎక్కడో మునిగి ఎక్కడో తేలాం" అంటూ చాలా సార్లు నవ్వుకునేవారు. వీరు 1999 ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్ అవార్డ్ అందుకున్నారు.

తులనాత్మక అద్యయన శాఖలో పరిశోధకులుగా వచ్చిన నూతన విద్యార్థులకు చుక్కానిలాగా మార్గదర్శకుడిగా ఉండేవారు. పరిశోధనలలో కొత్త అంశాలు, నూతన విధానాలకు ప్రాముఖ్యతను ఇచ్చేవారు. విద్యార్థి యొక్క కుటుంబ సామాజిక నేపథ్యాన్ని తెలుసుకొని, తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ, తమిళ్, కన్నడ భాషలలో సాహిత్య సాంస్కృతిక అంశాలను పరిశోదన అంశాలుగా నిర్ణయించేవారు.

అనంతపురం నుండి వెళ్లిన నన్ను, నా ఆసక్తిని గుర్తించి "మొహరం" పీర్ల పండగ నిర్వహణ/ఆచరణలో వచ్చిన మార్పులు, కారణాలు, అప్పటి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో మొహరం ఉత్సవానికి ఉన్న ప్రాధాన్యత గురించి పరిశోదన చేయమన్నారు. అప్పటికి తెలుగులో ఈ అంశంపై అసలు పరిశోధనలే జరిగి ఉండలేదు, ఒకటి రెండు వ్యాసాలు మాత్రమే వచ్చి ఉన్నాయి. హైదరాబాదులో నన్ను జానపద బ్రహ్మ ఆచార్య బిరుదురాజు రామరాజు గారిని పరిచయం చేశారు. నా పరిశోధనలో బిరుదురాజు గారి సహకారం, ప్రోత్సాహం మరువలేనిది. ఆ తర్వాత నేను వ్రాసిన "మొహరం శోక గీతికలు" పుస్తకానికి బిరుదురాజు గారే ముందుమాట రాశారు.

ఆచార్య గంగిశెట్టి లక్ష్మినారాయణగారు మానసికంగా శారీరకంగా చాలా గట్టివారు. హైదరాబదులోని లంగర్‌హౌస్‌లో వారి నివాసం ఉండేది. వారి ప్రవర్తనలో రాయలసీమ పౌరుషం ఉట్టిపడేది. లంగర్‌హౌస్‌లోని వారి ఇంట్లో ఒకసారి దొంగలు పడ్డప్పుడు, వారిని ఎదిరించి పట్టుకున్నారు. దొంగచేసిన కత్తిగాటు, గంగిశెట్టి గారి ముక్కుపై వారి ధైర్యానికి గుర్తుగా వుండిపోయింది.

తెలుగు సాహిత్యం కేవలం అనువాదప్రాయంగా మొదలయిందనే వాదనను ఆయన తిరస్కరించారు. ఆర్.ఎస్. సదర్శనం గారి రచనా విధానాన్ని అనుసరించిన ఆచార్య గంగిశెట్టి విమర్శలో రాళ్ళపల్లి గారిని ఆదర్శంగా తీసుకున్నారు. అలాగే సమగ్ర సాహిత్య అధ్యయన విధానానికి మరోపేరే విమర్శ అని గట్టిగా నమ్మేవారు. సమీక్ష చేయడమే విమర్శగా భావించే రోజుల్లో, అసలుసిసలైన విమర్శ ఇలావుంటుందని తన రచనల ద్వారా చూపించారు.

భాషా శాస్త్రంలో లాగే వర్ణనాత్మక, చారిత్రక, తులనాత్మక విమర్శ మార్గాలను నిరూపించుకుని, నిర్దిష్ట మార్గంలో వివేచన చేయడంవల్ల విమర్శ ఎక్కువ శాస్త్రీయ స్థాయిని పొందుతుందని గంగిశెట్టివారు పేర్కొన్నారు. 70 దశకంనుండి వివిధ సందర్భాలలో వారు వ్రాసిన వ్యాసాలు, చేసిన ప్రసంగ పాఠాలు ఒక సంపుటిగా ముద్రించి డాక్టర్.సి.నారాయణ రెడ్డికి అంకితమిచ్చారు. ఆ గ్రంథంలోని విభాగాలను 'తరంగాలు'గా నామకరణం చేశారు. ఆ తరంగాలలో నాటక తరంగం కూడా ఒకటి. వారు 'శ్రీ వేమన' అనే నాటకాన్ని కూడా రచించారు. ఆధునిక నాటక రచయితలలో జ్ఞానపీఠ అవార్డు గ్రహీత శ్రీచంద్ర శేఖర్ కంబాల్ గారంటే ఎనలేని గౌరవంచూపేవారు. నాటకరంగం మీద కూడా పరిమితంగానే రాసినా, వాటి మౌలికత నాటక విమర్శకుల దృష్టినాకర్షించింది. కంబాల్ కళాతత్వం గురించి రాసిన వ్యాసంలో ఆధునిక భారతీయనాటక రంగ వికాసాన్ని సమగ్రంగా వివేచించి, పాశ్చాత్యప్రభావంతో భారతీయ స్వభావం ఎలా సమసించిందో వివరించారు. అలాగే జానపదీయత, భారతీయ కళాదర్మాలనెలా బలంగా శాసిస్తున్నదో, దానిని ఆధునికతకు అనుగుణంగా పునర్నవీకరించుకోవలసిన విధానమూ, దాని ఆవశ్యకత గురించి మరికొన్ని వ్యాసాల్లో ప్రస్తావించారు.

ఆచార్య గంగిశెట్టి లక్ష్మినారాయణ గొప్ప పరిపాలనాదక్షులు. కేంద్రసాహిత్య అకాడమీ సభ్యులుగా, నేషనల్ బుక్‌ట్రస్టు సభ్యుడిగా, భారతీయ తులనాత్మక సంఘం, న్యూఢిల్లీ, అంతర్జాతీయ తులనాత్మక సంఘం, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా సేవలందించారు. 2005-2008 మధ్య కాలంలో ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం, ఉపకులపతిగా గంగిశెట్టి గారి సేవలు వారి దూర దృష్టికి, కార్యదక్షతకు నిదర్శణంగా నిలుస్తాయి. 78 సంవత్సరాల వయస్సులో 2025 ఆగస్టు 1 వతేది కాలిఫోర్నియాలో చివరిశ్వాస వదిలారు. అమెరికాలో ఉంటూకూడా సిలికోన సాహిత్య అకాడమీ (Silicon Academy of Letters) తరపున అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించేవారు.